క్లుప్తంగా...

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళకృష్ణ

అబిడ్స్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ మంగళవారం పంపిణీ చేశారు. డివిజన్ పరిధిలోని అర్హులైన లబ్దిదారులకు 75 కల్యాణలక్ష్మి, 17 షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శశికళ కృష్ణ మాట్లాడుతూ.. అర్హులైన వారికి ప్రభుత్వాల పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం.కృష్ణ, మంగళ్‌హాట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కిషోర్‌కుమార్, బీజేపీ నేతలు సురేష్ సింగ్, అమర్నాథ్‌సింగ్, లక్ష్మణ్, పరమేష్, అప్పు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



రాజేష్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేసిన బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం కొనసాగిస్తామని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బిహార్‌కు చెందిన రాజేష్‌కుమార్‌ను ఆ రాష్ట్రంలోని కైమూర్ జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమించారు. ఆయనకు పార్టీ కండువా కప్పి, నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాంబ రవీంద్రనాథ్, ధర్మేంద్ర తివారీ, పోలారం మాలి, ప్రశాంత్ గౌడ్, విష్ణు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మానవత్వం చాటుకోవాలి



తల్లి, నానమ్మతో నూతన కుమార్

గోల్కొండ: ప్రతిఒక్కరూ మానవత్వం చాటుకోవాలని కేసరి హనుమాన్ యువసంఘటన ప్రధాన కార్యదర్శి రక్షిత్‌సాగర్ అన్నారు. కార్వాన్‌కు చెందిన ఓ ఆరేళ్ల నిరుపేద బాలుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలిసిన కేసరి హనుమాన్ యువసంఘటన్ వారు దాతల సహకారంతో వచ్చిన డబ్బులతో బాలుడికి గుండె శస్త్ర చికిత్స నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఆ బాలుడు తన తల్లి, నానమ్మతో కేసరి హనుమాన్ యువ సంఘటన్, మహేష్ బాబు ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కాల్ సెంటర్ ఉద్యోగులకు ట్రాఫిక్‌పై అవగాహన

బంజారాహిల్స్: అమీర్‌పేట్ సమీపంలోని లాల్ బంగ్లా రోడ్డులో ఉన్న బీపీవో కన్వర్జస్ ప్రైవేట్‌లిమిటెడ్ కార్యాలయంలో మంగళవారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బేగంపేట టీటీఐ ఏసీపీ జి. శంకర్‌రాజు, ఎస్‌ఐ సిహెచ్. జ్యోతి, చక్రధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శంకర్‌రాజు స్టాప్‌లైన్, రాంగ్‌రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ద్వారా జరిగే ప్రమాదాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కళ్లకు కట్టారు. జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని కాల్‌సెంటర్ ఉద్యోగులకు సూచించారు. రోడ్డు మీద నడిచేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. సంస్థ సెంటర్ హెడ్ శంకర్, మేనేజర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో శిక్షణ

బంజారాహిల్స్: గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో డ్రాగన్స్ కుంగ్‌ఫూ అండ్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఫిలింనగర్‌లోని బందారు బాల్‌రెడ్డినగర్ బస్తీకి చెందిన హనీఫ్, వెంకట్ మాస్టర్ ఆధ్వర్యంలో ఇక్కడి బస్తీలోని విద్యార్థులు ఈ శిక్షణ ఇస్తున్నారు. రోజూ ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు కుంగ్‌ఫూ, కిక్‌బాక్సింగ్, మౌటాయ్, రింగ్‌ఫైట్, ఫిట్‌నెస్, వెయిట్‌లాస్‌లపై ఈ శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివిధ బస్తీల నుంచి 50 మంది వరకు బాల బాలికలు, యువతీ, యువకులు శిక్షణకు హాజరవుతున్నారని వెల్లడించారు. ఔత్సాహికులు గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో తమను సంప్రదించవచ్చని తెలిపారు. వేసవి సెలవులు వృథాగా గడపకుండా ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టి యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సూర్యుడు 90 డిగ్రీల్లో నిలిస్తే శూన్య ఛాయ



శూన్య ఛాయను పరిశీలిస్తున్న శంకరమంచి రామకృష్ణ, ఆచార్య తంగెడ కిషన్‌రావు

నాంపల్లి: హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల 12 నిమిషాలకు శూన్య ఛాయ ఏర్పడిందని జ్యోతి విభాగంలో పీహెచ్‌డీ చేసిన శృంగేరీ ఆస్థాన జ్యోతిష పండితుడు శంకరమంచి రామకృష్ణ శాస్త్రి తెలిపారు. మంగళవారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శూన్య ఛాయా దినోత్సవాన్ని పురస్కరించుకుని శూన్య ఛాయా దినము-పరిశీలన-అధ్యయనము-విశ్లేషణ అనే కార్యక్రమం జరిగింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ప్రత్యేక సమయంలో హైదరాబాద్‌లో మూడు రోజులు మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పడుతుందని, తమ గణనల ద్వారా లెక్క కట్టామని చెప్పారు. సూర్య సిద్ధాంతం ప్రకారం భూ ప్రదక్షిణ సమయంలో భూ అక్షాంశ, రేకాంశల రిత్యా సూర్య గమనం గణన చేసినప్పుడు కొన్ని ప్రాంతాల్లో సూర్యుడు సరిగ్గా 90 డిగ్రీలలో నిలిచినప్పుడు శూన్య ఛాయ ఏర్పడుతుందని అన్నారు. ఆ సమయంలో నిలువుగా ఉన్న వాటి ఛాయ కొన్ని సెకన్లు/నిమిషాల పాటు నేలపై పడదని శంకరమంచి రామకృష్ణ శాస్త్రి వివరించారు. ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ.. జ్యోతిష శాస్త్రం ద్వారా ఖగోళంలోని ఈ ప్రత్యేకతను మన విశ్వవిద్యాలయంలో ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, ప్రముఖ సంగీత విద్వాంసులు పులిపాక పూర్ణచంద్రరావ్, ఈ పూజాస్టోర్ సీఈఓ సోమేశ్వర శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో ఫీల్‌ఖానాలో మరుగుదొడ్లను నిర్మిస్తాం



కూల్చివేసిన మరుగుదొడ్లను పరిశీలిస్తున్న పూజవ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: వ్యాపారుల కోసం ఫీల్‌ఖానాలో మరుగుదొడ్ల నిర్మాణం త్వరలోనే చేపడుతామని బేగంబజార్ డివిజన్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ పూజవ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గతంలో బేగంబజార్ డివిజన్‌లోని ఫీల్‌ఖానా ప్రాంతంలో మరుగుదొడ్లను కూల్చివేసిన ప్రాంతంలోనే ఆధునాతన మరుగుదొడ్లను నిర్మిస్తామని ఆమె వెల్లడించారు. మంగళవారం ఫీల్‌ఖానా ప్రాంతంలో స్థానిక వ్యాపారస్తులతో కలిసి మరుగుదొడ్ల ప్రాంతాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తారని ఆమె వివరించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ సహకారంతో వ్యాపారుల సమస్యలను, స్థానికుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వ్యాపార వర్గాలకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉందని పూజవ్యాస్ బిలాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బేగంబజార్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సునిల్ సాహు, బిజినెస్ సెల్ అధ్యక్షుడు కిశోర్‌సింగ్ రాజ్ పురోహిత్, బీఆర్‌ఎస్ నేతలు ప్రదీప్‌రాజ్, రాజ యాదవ్, శివశంకర్ శర్మ, సంతోషి, పుష్ప, పప్పుమాత్రే తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయించాలి



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బల్దియా కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్‌ను ఆయన మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధి, జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర విషయాలపై చర్చించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు పనులు సకాలంలో పూర్తి చేయడం లేదన్నారు. దీని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులు మందగించాయని ఆయన బల్దియా కమిషనర్ దృష్టికి తెచ్చారు. జోనల్ స్థాయి బల్దియా అధికారులు సైతం పనులు పూర్తి చేయించడంలో శ్రద్ధ కనబర్చడంలేదని ఆయన అన్నారు. అకాల వర్షాలతో గోల్కొండ, కార్వాన్, టోలిచౌకి, నానల్‌నగర్ డివిజన్లలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే పక్కా పనులు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. జోనల్ స్థాయి అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయిస్తానని, అవసరం అయితే తాను కూడా కార్వాన్ నియోజకవర్గంలో పర్యటిస్తానని ఎమ్మెల్యేకు కమిషనర్ హామీ ఇచ్చారు.

జీఓ 317 ప్రకారం ఉద్యోగులకు న్యాయం చేయండి



మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసిన టీఎన్జీఓస్ యూనియన్ నాయకులు

అబిడ్స్: జీఓ 317 ప్రకారం జరిగిన ఉద్యోగుల విభజనలో కొందరికి అన్యాయం జరుగుతుందని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని, కార్యదర్శి విక్రమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి తూనికలు కొలతల శాఖ, పౌర సరఫరాల శాఖల్లో జీఓ 317 ప్రకారం కొందరు ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలను వివరాలతో కూడిన నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. నలుగురికి గాయాలు

అబిడ్స్: ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జుమ్మేరాత్‌బజార్‌లో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలి అంజయనగర్‌కు చెందిన ఠాకూర్ రాకేష్ సింగ్(29) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆటోలో నానమ్మ మున్నాబాయి (69), చిన్నమ్మలు, రాణీబాయి (40), రాధాబాయ్ (46)తో కలిసి బేగంబజార్‌లో షాపింగ్ కోసం వచ్చారు. మంగళవారం సాయంత్రం షాపింగ్ పూర్తి చేసుకుని ఆటోలో తిరిగి గచ్చిబౌలికి వెళ్తుండగా జుమ్మేరాత్ బజార్‌లో పురానాపూల్ వైపు నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న రాజేష్ సింగ్‌తో పాటు అతని నానమ్మ, మున్నాబాయిలకు తీవ్ర గాయాలయాయి. ఆటోలో ఉన్న రాణీబాయి, రాధాబాయిలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు గాయాలైన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ కేసును షాహినాయత్‌గంజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడుల పేరుతో రూ. 11 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: పార్ట్‌టైం జాబ్ అంటూ మాట కలిపి ఆ తర్వాత పెట్టుబడులు పెట్టించి ఓ యువకుడి నుంచి భారీ మొత్తంలో కాజేశారు సైబర్ నేరగాళ్లు. సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఓ ఐటీ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న యువకుడికి కొన్ని నెలల క్రితం పార్ట్‌టైం జాబ్ పేరుతో టెలిగ్రాం ద్వారా ఓ వ్యక్తి పరిచయమైయ్యాడు. ఆ వ్యక్తి పార్ట్‌టైం జాబ్‌తో పాటు ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని సూచించాడు. దీనికి అంగీకరించిన యువకుడు అతగాడు చెప్పిన విధంగా పెట్టుబడులు పెట్టుకుంటూ పోయాడు. ఇలా పలు దఫాలుగా రూ. 11 లక్షలు స్వాహా చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ చెప్పారు.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని..



జాహ్నవి (ఫైల్)

సంతోష్‌నగర్: ఇంటర్మీడియేట్ పరీక్షల్లో తప్పడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంతోష్‌నగర్ ప్రాంతానికి చెందిన పి.జాహ్నవి (17) ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ విద్యనభ్యసిస్తుంది. మంగళవారం విడుదలైన ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ ఆహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్ సమీనాబేగం

యాకుత్‌పురా: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ ఆహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. వైద్య విధాన పరిషత్ అమన్‌నగర్-బీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రారంభించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పేదలు నివాసముండే ప్రాంతాల్లో మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిబిరంలో తలాబ్ చంచలం కార్పొరేటర్ సమీనా బేగం, మజ్లిస్ పార్టీ నాయకులు సిద్దిఖీ, షేక్ జఫర్, మహ్మద్ అలీఖాన్, మీర్ షోహెబ్ అలీ, అమన్‌నగర్-బి యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహ్మద్ రఫీక్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో నేలమట్టమైన చర్చిలను పునర్ నిర్మించండి



ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హైదరాబాద్ సాలిడార్టి ఫోరం నాయకులు

అబిడ్స్: మణిపూర్‌లో నేలమట్టమైన చర్చిల పునర్ నిర్మాణాలు వెంటనే చేపట్టాలని హైదరాబాద్ సాలిడార్టి ఫోరం డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద హైదరాబాద్ సాలిడార్టి ఫోరం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ప్లకార్డులు ప్రదర్శించారు. మైనార్టీలకు మణిపూర్‌లో రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. మణిపూర్‌లో మైనార్టీలకు రక్షణ కల్పించాలని, మైనార్టీల హక్కులను కాపాడాలని వారు ప్లకార్డులతో ప్రదర్శనలు చేశారు. నేలమట్టమైన 41 చర్చిలను వెంటనే నిర్మాణ పనులు చేపట్టి మైనార్టీల హక్కులను కాపాడాలన్నారు. మణిపూర్‌లో పెద్ద ఎత్తున విధ్వంసాలు జరిగినా ప్రభుత్వం నిరోధించలేకపోయిందని ఆరోపించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద నిరసన చేస్తున్న హైదరాబాద్ సాలిడార్టి ఫోరం ప్రతినిధులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నిరసన చేసినందుకు అనుమతులు లేవని పోలీసులు వారితో వాదించారు. ఈ నిరసన కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు వర్గీస్, రాయిడన్ రోష్, సారా మ్యాథూస్‌లతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తాం



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలే భాస్కర్ రాజ్, గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్: ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం వెంటనే ఆలయాల వద్దకు వెళ్లి ఆయా ఆలయాల వద్ద చేపట్టాల్సిన పనులను పర్యవేక్షిస్తామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ అన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో కలిసి పర్యటిస్తామన్నారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ అధ్యక్షతన జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. గత సంవత్సర బోనాలకు జీహెచ్‌ఎంసీ చేపట్టిన కంప్లీషన్ రివ్యూ.. 2023 బోనాలకు చేపట్టాల్సిన పనులకు సంబంధించిన వినతిపత్రం అందజేశారు. మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఉపాధ్యక్షులు ఎస్.పి.క్రాంతి కుమార్, భవానీ శంకర్ గౌడ్, ఆకుల వేణు, శ్రీధర్, ప్యారసాని వెంకటేశ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఉత్సవాల కన్నా ముందే అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు.

అర్హులకే బోజగుట్ట డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి జీవన్ సింగ్

గోల్కొండ: బోజగుట్టలో అర్హులైన వారికే డబుల్ బెడ్‌రూంలు కేటాయిస్తామని బీఆర్‌ఎస్ కార్వాన్ ఇన్‌చార్జి టి. జీవన్ సింగ్ అన్నారు. మంగళవారం ఆయన గుడిమల్కాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బోజగుట్ట డబుల్ బెడ్‌రూంల కేటాయింపుపై మాట్లాడారు. బోజగుట్టలో 500 మంది స్వచ్ఛందంగా తమ ఇళ్లను డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి ఇచ్చారని, ఈ విషయంపై న్యాయస్థానం కూడా ఈ 500 మందికే ఇళ్లు కేటాయించాలని స్పష్టంగా తీర్పునిచ్చిందన్నారు. అయితే కొందరు అసలు విషయాలను దాచి బోజగుట్ట డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు.

స్మార్ట్ అగ్రికల్చర్ రోబోట్‌పై వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో కళాశాల డైరెక్టర్ సాయిబాబారెడ్డి తదితరులు

అబిడ్స్: వీజేఐటీ కళాశాలలో స్మార్ట్ అగ్రికల్చర్ రోబోట్ వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఐఈఈఈ కమ్యూనికేషన్స్ సొసైటీ, ఐఈఈఈ ఆర్‌ఏఎస్ సొసైటీస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో కళాశాల డైరెక్టర్ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మజ, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రాజేంద్రప్రసాద్, అకాడమిక్ కో ఆర్డినేటర్ జి.శ్రీలత, సీనియర్ ఏఓఆర్ వెంకటాచలం, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ.. ఐఈఈఈ విద్యార్థి శాఖ ఆధ్వర్యంలోని విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. సాలిడ్ వర్క్స్, మ్యాట్‌లాగ్, ప్రొటీయస్ వంటి సాఫ్ట్‌వేర్ సాధనాలను ఉపయోగించి రోబోట్ డిజైన్, సిమ్యులేషన్, అసెంబ్లింగ్‌పై మూడు రోజుల శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సాయిబాబారెడ్డి ప్రోత్సాహంతో సాధ్యమైందన్నారు. అదేవిధంగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రాజేంద్రప్రసాద్, అకాడమిక్ కో ఆర్డినేటర్ జి.శ్రీలత, సీనియర్ ఏఓ వెంకటాచలం, ఈసీ అధ్యాపకులు పాల్గొని వర్క్‌షాప్‌లోని విద్యార్థులను ప్రోత్సహించారు.

నిషేధిత విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



జియాగూడ: నిషేధించబడిన విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఖలీల్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్‌కు చెందిన పాత నేరస్థుడు విపుల్ రాంక (38) బేగంబజార్ అజీజ్ ప్లాజాలో కన్‌ఫెక్సనరీ వ్యాపారం చేస్తున్నాడు. అక్రమంగా విదేశీ సిగరేట్లను అమ్మడం, కొనడం, తరలించడం చేస్తుంటాడు. మంగళ్‌హాట్ సీతారామ్‌బాగ్‌లో ఉన్న ప్రగతి ట్రాన్స్‌పోర్టు మేనేజర్ దీపక్ జాదవ్ (28)తో పరిచయం చేసుకుని కన్‌ఫెక్సనరి వ్యాపారంతో పాటు ఫారిన్ సిగరేట్ల ట్రాన్స్‌పోర్టు ద్వారా తెప్పించుకుంటున్నాడు. ఢిల్లీ నుంచి తక్కువ ధరకే ప్యారిస్ సిగరేట్లను తెప్పించుకుని హైదరాబాద్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ డబ్బు సంపాదిస్తున్నాడు. ఈ విదేశీ సిగరెట్లు తెప్పించుకున్న సందర్భంలో కస్టమ్స్ డ్యూటీ, జీఎస్‌టీ సైతం ఎగ్గొడుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళ్‌హాట్ సీతారామ్‌పేట్‌లో దాడులు నిర్వహించగా రూ.8 లక్షల విలువ చేసే ప్యారిస్ సిగరెట్ల సరుకు లభించింది. నిందితుడు మంగళ్‌హాట్, బేగంబజార్ పోలీస్‌స్టేషన్లలో పాత నేరస్థుడు. తదుపరి విచారణ నిమిత్తం మంగళ్‌హాట్ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో ఎస్సై షేక్ కవియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన సింధూ కాలేజీ



ఆయేషా సుల్తాన్



స్వాతి

గోల్కొండ: ఇంటర్ ఫలితాల్లో మెహిదీపట్నంలోని సింధూ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారు. మంగళవారం వెల్లడైన ఫలితాల్లో సెకండ్ ఇయర్ బైపీసీ విద్యార్థిని సయ్యదా ఆయేషా సుల్తానా వెయ్యి మార్కులకు 971 మార్కులు సాధించింది. అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎం. స్వాతి సీఈసీ 500 మార్కులకు గాను 471 మార్కులు సాధించింది. గత దశాబ్దానికి పైగా తమ కళాశాల ప్రతియేటా ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటుతూ వస్తుందని కళాశాల చైర్మన్ వెంకట చలపతి అన్నారు. మంగళవారం సాయంత్రం కళాశాల మొదటి, రెండవ సంవత్సరం టాపర్స్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామారావు, ప్రిన్సిపాల్ భార్గవి దేశ్ పాండే తదితరులున్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'బీజేఆర్'హవా

గోల్కొండ: గోల్కొండలోని బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి, రెండవ సంవత్సర ఫలితాల్లో గతంలో కంటే మంచి ఫలితాలు సాధించింది. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో మొత్తం 369 మంది పరీక్షలు రాశారని, వీరిలో 63 శాతం విద్యార్థినీలు పాస్ అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ మాధవి తెలిపారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరంలో మొత్తం 15 మంది బాలికలు ఏ గ్రేడ్ సాధించారని వొకేషనల్ ఏ అండ్ డి సెకండ్ ఇయర్ విద్యార్థినీ 1000కి గాను 890 మార్కులు సాధించిందని ఆమె తెలిపారు.

ఇందిరానగర్‌లో రోడ్డు నిర్మాణానికి రూ. 1.05 కోట్లు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఇంజినీర్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో అంతర్గత రహదారుల నిర్మాణం కోసం రూ. 1.5 కోట్లు మంజూరయ్యాయి. బస్తీలో ఏడు అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్లు వేయనున్నారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ప్రారంభమైంది. త్వరలోనే రోడ్డు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో నాలుగు అంతర్గత రహదారుల నిర్మాణం కోసం రూ. 49 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు కూడా టెండర్ ప్రక్రియలో ఉన్నాయని జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం రూ. 19 లక్షల వ్యయంతో గౌతంనగర్ చౌరస్తా నుంచి వినాయకనగర్ బస్తీ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయని తెలిపారు. ఈ పనులను మంగళవారం ఆయన సంబంధిత ఇంజినీర్‌తో కలిసి పరిశీలించారు.

ఆక్సిజన్ సిలిండర్ల లీకేజీ

గ్యాస్ సిలిండర్లని పరుగులు తీసిన జనం

చాంద్రాయణగుట్ట: ఆటోలో తరలిస్తున్న ఆక్సిజన్ సిలిండర్లు లీక్ కావడంతో భయంతో వాహనదారులు తమ వాహనాలను వదిలి పరుగులు తీసిన ఘటన హఫీజ్‌బాబానగర్‌లో మంగళవారం సాయంత్రం తీవ్ర కలకలం రేపింది. అప్రమత్తమైన ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి తన బృందంతో కలిసి ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించడంతో పాటు ఫైరింజన్‌కు సమాచారం అందజేశారు. వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి నుంచి గగన్‌పహాడ్‌కు ఓ ట్రాలీ ఆటోలో 11 ఆక్సిజన్ సిలిండర్‌లతో బయలుదేరింది. మార్గం మధ్యలో హఫీజ్‌బాబానగర్‌లో మంగళవారం సాయంత్రం ఓ ఆక్సిజన్ సిలిండర్ లీకైంది. ట్రాలీ ఆటో వెనుక ఉన్న వాహనదారులు అవి గ్యాస్ సిలిండర్లు అనుకొని ఒక్కసారిగా వాహనాలను అక్కడే వదిలి భయంతో పరుగులు తీశారు. దీనిపై సమాచారం అందుకున్న ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి బృందం వెంటనే అక్కడికి చేరుకొని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ రహదారి గుండా రాకపోకలను నిషేధించి ట్రాఫిక్‌ను మళ్లించారు. అంతేకాకుండా ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అవి గ్యాస్ సిలిండర్‌లు కావు.. ఆక్సిజన్ సిలిండర్లు అని.. ప్రాణానికి ప్రమాదం లేదని ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి అలర్ట్ చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఆటో డ్రైవర్ కూడా ఆటో వదిలి పరారయ్యేందుకు ప్రయత్నించగా.. అతన్ని కూడా ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.